# ప్రత్యామ్నాయాలు

సముద్రంలో తుపాను-

రెండు రోజులుగా పట్టిన ముసురు, ఆగి ఆగి వానజడి పడుతూనే ఉంది.

సుభద్రకి వానంటే ఎంతో ఇష్టం. పదేళ్ళ క్రితం మండువా లోగిట్లో కురిసే వానని తనివితీరా ఆస్వాదిస్తూ ఉండేది.

చీకటి కొటారాల్లాంటి గదుల్లో మగ్గిపోతున్న సుభద్రకి వాన రావడం ఓ పెద్ద రిలీఫ్. ఇంటిపైన కురిసిన వర్షం నాలుగు వైపులనుంచి గంగాళాల్తో దిమ్మరించినట్లు మండువా కంతలో జలపాతమయ్యేది. ఇంటిబైటికెళ్ళి వర్షాన్ని ఆస్వాదించే అవకాశం లేని సుభద్ర ఆ రెండు బారల ఖాళీలోనే వానలో తడిసేది.

జాలువారే వెన్నెల జాలరు కోసం అర్ధరాత్రి లేచి పదేపదే మండువాలోకొచ్చేది. కృష్ణ పక్షంలో నక్షత్రాల్తో నిండిన చారెడు ఆకాశం ఒక్కోసారి ఒక్కోపటాన్ని ఆవిష్కరించేది. ఆ రోజులు గతించి పోయాయి. రెండెకరాల ఖాళీ స్థలంలో కట్టిన మూడంతస్తుల భవంతి తమ జీవితపు విలువల్నే మార్చేసింది.

ఏ వైపు కిటికీ తెరిచినా ఎంతో విశాల ప్రపంచం, కాని ఏ కిటికీని తెరిచి చూసే అవకాశం లేదు. కిటికీకొక గన్‌మేన్, మూడో అంతస్తుపైన నిలువున్నర ఎత్తు పిట్టగోడ, కేవలం ఆకాశాన్ని తప్ప పరిసరాల్ని పరికించనీయని గోడ.

పూర్వకాలపు ఒంటిస్తంభపు మేడలోని రాజకుమారిలా భయం... భయం... ప్రాణభయం...

ప్రాణభయంలోంచి పుట్టుకొచ్చిన జాగ్రత్త ఇంటిని జైలుగా మార్చేసింది. ఎక్కడా ఖాళీ లేకుండా ఇంటిని అల్లుకున్న కంచె, ముట్టుకుంటే షాక్ కొట్టే విద్యుత్ ప్రసారపు కంచె-

గృహం విశాలమయ్యే కొద్దీ జీవితం ఇరుకైపోయింది. కన్నబిడ్డలిద్దరూ ఏడాదికోసారి తప్ప కంటికి కన్పించనంత దూరంలో హాస్టల్స్‌లో చదువుల కోసం -

పెదవి కదపకముందే అన్నీ అమర్చే సేవకజనం; ఏదీ ఆస్వాదించలేని నిస్సహాయపు ఒంటరితనం -

ఇంటి నిండా నిరంతరం సంచరించే చుట్టాలు, బంధువులు, అందరికీ కలిపి హాల్లో హోమ్ థియేటర్. తన బెడ్ రూంలో పెద్ద కలర్ టీ.వీ. తెలుగు ఛానల్స్‌లోని ఏడుపులు, కష్టాలూ, కార్పణ్యాలు, ఇంగ్లీష్ చానల్స్‌లోని హింసలు, అసభ్య సన్నివేశాలు చూసి తట్టుకునే ఓపికలేదు.

తన ఏకైక నేస్తం రంగంపెట్టె.

రంగూన్ నుంచి వచ్చిన వాళ్లెవరో అమ్మేస్తుంటే తన తండ్రి ముచ్చటపడి కొన్న పెట్టె అది. దాన్ని తెరిస్తే చాలు బాల్యం నాటి ఎన్నెన్నో జ్ఞాపకాల అలలు.

బర్మా నల్లటేకు కర్రతో చేసిన పెద్ద దీవానంత పెట్టె. మూత తెరిస్తే ఎన్నెన్ని అరలు! ఎంత అలంకరణ! మూత తెరవగానే గలగలమని చేసే చిరుమువ్వల సవ్వడి. ఆ సవ్వడి విన్నప్పుడల్లా తల్లి తనని చిన్నప్పుడు సన్నని గొంతుతో లాలిస్తూ పాడే 'లాలీ లాలమ్మ లాలీ' పాట గుర్తుకొస్తూ ఉంటుంది.

పెట్టె లోపల వెండిరేకుల తాపడాలు, మూత మధ్యలో గజలక్ష్మి వెండి విగ్రహం. ఆ చుట్టూ అతికించిన అద్దపు ముక్కల్లో చూసే వాళ్ళ ముఖాలు వేనవేలుగా కన్పిస్తూ... అరలపైన పంచలోహాల పూలు, పైకి కన్పించని దొంగ అరలు... అదో అద్భుతమైన లోకం సుభద్రకి.

బలమైనవాళ్ళు ఆరుగురు కలిస్తేగాని కదిలించలేనంత బరువైన పెట్టె. తన చిన్నతనంలో నాయనమ్మవీ, తనవీ, తల్లివీ బంగారు నగలు దొంగ అరల్లోను, వెండి సామాను బైటి అరల్లోను ఉండేవి. ఎప్పుడు చూసినా ఆ పెట్టెకి పెద్ద తాళం కప్ప వేళ్ళాడుతూండేది. దాని తాళంచెవి నాయనమ్మ చీరకొంగున వేళ్ళాడే తాళాలగుత్తిలో ఉండేది.

తను తరచుగా ముక్కాలిపీట వేసుకుని పెట్టెమీదికి ఎక్కడానికి ప్రయత్నించేది. నాయనమ్మ చూస్తే వెంటనే ఎత్తుకుని కిందికి దింపేసేది. "కావాలంటే ఆ పక్కనున్న భోషాణం పెట్టెమీదికి ఎక్కి ఆడుకో, దీంట్లో లక్ష్మీదేవి ఉంది, దీనిమీద కాళ్ళు మోపకూడదు" అనేది.

ఆ పెట్టెను తెరుస్తారని తెలిస్తే చాలు ముందుగా తనే హాజరై పోయేదక్కడ. పెట్టెలోపలికి చూడడం అంత ఇష్టంగా ఉండేది. ఆ ఇష్టాన్ని గమనించి తండ్రి తనకి పెళ్ళి చేసి అత్తింటికి పంపించేటప్పుడు సారెతో బాటు ఈ పెట్టెను కూడా పంపించాడు. పెట్టెమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమిరింది సుభద్ర. ఏదో గుర్తుకొచ్చి చురుక్కుమని చేతిని వెనక్కి తీసుకుంది. ఇప్పుడీ పెట్టె దొంగ అరల్లో తుపాకులున్నాయి. లైసెన్సులు ఉన్నవీ, లేనివీ.

ఇప్పుడీ పెట్టె మూత తెరవాలంటే భయం తనకి. సన్నిహితులు రుద్రీ అని, బైటి వాళ్ళు రుద్రా అని పిలిచే రుద్రరాజుని అల్లుడిగా తన తండ్రి ఎంచుకునేసరికి అతను వందల ఎకరాల భూస్వామి కొడుకు. బంగారం పండే గోదావరి పరీవాహ ప్రాంతంలోని సుక్షేత్రమైన మాగాణీ భూములు. పండించడం, పంటల్ని అమ్మిన డబ్బుతో మళ్ళీ భూమిని కొనడం, అతని పూర్వీకులు అలాగా భూమిని పెంచుకుంటూ వచ్చేరు.

లేండ్ సీలింగ్ రాబోతోందని ముందే తెలిసి తెలివిగా చాలా వరకు భూముల్ని అమ్మేసి డబ్బుగా మార్చేసాడు రుద్ర తండ్రి. ఆ డబ్బును వివిధ రంగాల వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టేడు. అన్నీ ఆయన చూసుకోలేక కొడుకుని చదువు మాన్పించి అడవుల్లోని కలప వ్యాపారం అప్పగించేడు.

ఆ వ్యాపారంలోనే సుభద్ర తండ్రికి, రుద్రరాజు తండ్రికి పరిచయమైంది. ఆ పరిచయం వియ్యానికి దారితీసింది.

అప్పటికి వాళ్ళ కులంలో ఉన్న ఆచారం ప్రకారం పెళ్ళి చూపులు వధూవరుల మధ్య లేవు. పెద్దలు కుదిర్చిన వివాహం, పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు ఒకర్నొకరు పెళ్ళిపీటల మీద చూసుకోవాల్సిందే. సుభద్ర ఇంటర్మీడియేట్ చదువుకున్నా పెద్దలనెదిరించే ధైర్యం లేనిది. పుట్టింట్లో అలవాటే అత్తింట్లోనూ కొనసాగింది.

పెళ్ళికి ముందు రుద్ర గురించి ఎవరెవరో ఏవేవో వార్తలు చేరవేసేవారు సుభద్ర తండ్రికి. రుద్ర ఆస్తిపాస్తుల ముందు అవేవీ లెక్క చెయ్యదగినవిగా అన్పించలేదాయనకి.

రుద్ర కలప వ్యాపారం చెయ్యడం లేదని, అడవిలో ఉద్యమకారుల్తో కలిసి తిరుగుతున్నాడని ఒకరంటే, తిరగడం కాదు అతనెప్పట్నుంచో ఉద్యమంలో ఉన్నాడు మారుపేరుతో అని ఒకరు, అసలీ పెళ్ళి జరగదు అని కొందరన్నారు.

పెళ్ళి ముందు రోజుకి కూడా అతను ఇంటికి చేరుకోలేదట. ఇటు తన తండ్రికి, అటు అతని తండ్రికీ స్థిమితం లేకుండా పోయింది. ఎందరెందరో ఎన్నెన్నో ఊహాగానాలు చేసారు. కాని, పెళ్ళి రోజు ఉదయానికి ఆకాశంలోంచి ఉల్కలాగా ఎక్కణ్ణుంచో ఊడిపడ్డాడు రుద్ర.

పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది. పెళ్లైన మర్నాడే సుభద్ర బాల్యచాపల్యంతో తన భయాల్ని అతని ముందు వెళ్ళబోసుకుంది. సురక్షితమైన గోదావరి జిల్లాలో పుట్టి ఉద్యమాల్లోకి వెళ్ళాల్సిన అవసరం ఏమిటని నిలదీసింది.

అతను చూపుడు వేలుతో సుభద్ర చుబుకాన్ని పైకెత్తి నర్మగర్భమైన నవ్వొకటి నవ్వేడు. "అమ్మో, అమాయకురాలివనుకున్నానే గడుసుదానివే" అన్నాడు.

కొంచెం ఆగి "నువ్వు నా జీవన సహచరివి. నాకు సహకరించు అంతే, ప్రశ్నల్తో వేధించొద్దు" అన్నాడు.

అతని స్వరంలో ఏం మంత్ర ముందో సుభద్ర మంత్రముగ్ధలా తల ఊగించింది.

మర్నాడు నాయనమ్మకి చెప్తే "ఓసి గడ్డుగ్గాయిదానా ! మొగ మారాజుల్తో అలాగ మాట్లాడొచ్చా? నువ్వెక్కడ దొరికేవే పుట్టింటి పరువు తియ్యటానికి! సర్లే, చిన్న పిల్లవి, జరిగిందేదో జరిగిపోయింది. ఇక ముందెప్పుడూ ప్రశ్నల్తో వేధించకమ్మా. ఆరికీ, ఆరి తండ్రిగారికీ కోపాలొస్తాయి. ఆడదాని బతుకూ అరిటాకూ సమానవని ఇనలేదూ! ఆరికి కోపాలొస్తే ఇంకేవన్నా ఉందా? మారు మనువులోళ్ళలాగా మొగోణ్ణి ఎదిరిత్తే కోరికోరి బతుకు గోదాట్లో కలిపేసుకున్నట్టే" అని చాంతాడంత భారతం చదివింది.

రుద్ర ఆజానుబాహుడు, అందమైన వాడూను.

మొదట్లో రెప్పలార్పకుండా అతన్నే చూడాలన్పించేది సుభద్రకి.

అతను మాత్రం ఆమె బుగ్గమీద చిటికె వేసి నవ్వుతూ వెళ్ళిపోయేవాడు. ఆ వెళ్ళడం వెళ్ళడం తిరిగి ఎన్నాళ్ళకో రావడం. పెద్దవాళ్ళు అడిగితే వ్యాపార బాధ్యతలు, తీరిక కుదరటం లేదని సమాధానం. ఆ తీరిక సమయాన్ని వృధా చేసుకోకుండా ప్రైవేటుగా చదివి పరీక్షలు రాసి డిగ్రీ పాసైంది సుభద్ర. ప్రపంచ సాహిత్యం నుంచి మంచి పుస్తకాలు సెలెక్ట్ చేసుకుని చదవడం అలవాటు చేసుకుంది. దాని నుంచి ఏది మంచో, ఏది కాదో విడమరిచే జ్ఞానం అలవడింది. ఇప్పుడు సుభద్రకి అన్నీ తెలుసు. తెలిసీ, తెలియనట్టు ఉండడమూ తెలుసు. ఇద్దరు బిడ్డల తండ్రయ్యేక క్రమంగా బైటికెళ్ళి ఉండిపోవటం తగ్గించేడు రుద్ర. రాత్రి ఏ టైం అయినా ఇంటికొచ్చేసే వాడు. 'హమ్మయ్య, బాధ్యత వొంటపడుతోంది' అని సంబరపడ్డారు అందరూ.

ఉద్యమకారుల మీద పోలీసు పహరా ఎక్కువైందని, అందుకే రుద్ర పోలీసులకి లొంగిపోయి విడుదలయ్యేడని, అతని మీద ఏవేవో కేసులు నడుస్తున్నాయని, అతను తరచుగా కోర్టుకి హాజరవుతుంటాడని పనివాళ్ళు అనుకుంటూండగా వింది సుభద్ర.

తమ మాటలు సుభద్ర విన్నదని తెలిసి చాలా భయపడిపోయారు వాళ్ళు.

ఓ రోజు ఉన్నట్టుండి టీవీలో ప్రత్యక్షమయ్యేడు రుద్ర.

ఆరు నెలల తర్వాత రాబోయే ఎన్నికల్లో నిలబడబోతున్నాడట. ఎన్నడూ లేనిది నలుగురు ప్రైవేటు గన్‌మ్యాన్‌లను వెంటబెట్టుకొచ్చేడు ఇంటికి. ఎప్పుడూ అతని నిర్ణయాలు అతనివేగాని ఎవ్వర్నీ సంప్రదించే అలవాటే లేదు రుద్రకి.

ఆ రోజు తండ్రికీ అతనికీ ఘర్షణ జరిగింది. పెద్దగా కేకలు వేసుకున్నారు. తండ్రి అతన్ని మందలించాడు.

"ఇంతకాలం నువ్వేం చేసినా ఒక్కగానొక్కడివని, ఏమంటే ఏం నొచ్చుకుంటావోనని పట్టించుకోనట్టు నటించేను. కాని, రుద్రీ! ఇప్పుడీ రాజకీయాలు మనకి అవసరం అంటావా?" అన్నాడాయన. "కాలం తీసే పరుగుల్లో నన్ను వెనకబడి పొమ్మంటున్నారు మీరు. ప్రస్తుతం రాజకీయాలే గొప్ప వ్యాపారం. పేరుకి పేరూ, డబ్బుకి డబ్బూ" అన్నాడు రుద్ర.

"ఇప్పటి వరకూ పట్టుకు వేళ్ళాడిన ఉద్యమాలూ, ఆదర్శాలూ ఏమయ్యాయి? దారి ఇటు మళ్లిందేం?" అన్నాడు పెద్దాయన ఎగతాళిగా.

"నేనేం పట్టుకుని వేళ్ళాడలేదు. అలా చేసి ఉండకపోతే అడవిలో చెట్లు ఎప్పుడంటే అప్పుడు నరకనిచ్చేవారా? ఎన్ని లక్షలు అడవి ముడుపులు చెల్లించాల్సి వచ్చేదో మీకేం తెల్సు! ఎప్పటికేది ప్రస్తుతమో నాకు తెలుసు" అంటూ మాట త్రుంచేసి తమ గదిలోకి వచ్చేశాడు రుద్ర.

కొడుకు తన మాటనలా త్రుంచేయడం పెద్దాయన్ని హర్ట్ చేసింది. పౌరుషానికి పోయి ఆస్తిపంపకాలు చేసి కొడుక్కి సగం ఆస్తి రాసిచ్చేసేడు. కొడుకుతో మాట్లాడ్డం మానేసాడు.

అది జరిగిన కొద్దిరోజులకే కొన్ని ఎకరాల మేర కాయలు కాస్తున్న కొబ్బరి తోటను నరికించి ఈ ఇంటిని కట్టించడం ప్రారంభించాడు రుద్ర.

ఓ రోజు అర్ధరాత్రి దాటేక వేన్‌లో డబ్బు సంచులు వచ్చాయి. మొదటిసారిగా సుభద్రనడిగి రంగం పెట్టె తాళం తీసుకున్నాడు రుద్ర. దానిపై అరలు తీసి పక్కన పెట్టి డబ్బు కట్టలు సర్దేడు. నగలు బేంక్ లాకర్స్‌లో పెట్టుకోవడం ప్రారంభమయ్యేక రంగం పెట్టె ఖాళీగానే ఉంటూ వచ్చింది.

వచ్చిన డబ్బు కొద్ది రోజుల్లోనే ఖాళీ అయిపోయేది. మళ్ళీ ఏదో ఓ రోజు రాత్రి డబ్బు సంచులు వచ్చి పెట్టెనిండిపోయేది. రుద్ర చాలా మేరకి భూములు, కొబ్బరి తోటలు అమ్మేస్తున్నాడని చెప్పుకొనేవారు.

ఉన్నట్టుండి ఓ రోజు ఆ ప్రాంతపు రాజకీయాల్లో పండిపోయిన సుబ్బరాముడు హత్యచేయబడ్డాడు. అతను మంత్రి పదవిలో ఉన్నాడు. ఏదో ప్రారంభోత్సవానికి వెళ్ళిన అతన్ని దూరం నుంచి షూట్ చేసి పారిపోయారెవరో.

సరిగ్గా అదే సమయానికి కొత్త ఇంటి గృహ ప్రవేశానికి పీటలమీద కూర్చుని సుభద్రతో కలిసి పూజ చేస్తున్నాడు రుద్ర.

ఆ ఫంక్షనుకి చాలా మంది రాజకీయనాయకులు వచ్చారు. కొందరికి ప్రైవేటు హెలికాప్టర్లు, మరికొందరికి ఎ.సి. కార్లు ఏర్పాటు చేసి వాళ్ళని రప్పించాడు రుద్ర.

ఖరీదైన భోజనంతోబాటు ఖరీదైన గిఫ్టులు ఎరేంజ్ చేసాడు. జిల్లాలో ప్రసిద్ధమైన అన్నవరం ప్రసాదం పేకెట్లు తెప్పించి పంచి పెట్టించాడు.

సుబ్బరాముణ్ని రుద్ర చంపించి ఉంటాడని కొందరు గుసగుసలాడుకున్నారు. కాని, ఖచ్చితంగా అతడిని ఎవరూ అనుమానించలేకపోయారు. అనుమానించిన ఒకళ్ళిద్దరూ ఏమీ చెయ్యలేకపోయారు.

ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చే వాళ్ళు లేక రుద్ర సునాయాసంగా గెలిచేడు. అయినా, డబ్బు వెదజల్లబడిందనీ, సారాయి ఏరులై ప్రవహించిందనీ చెప్పుకొన్నారు.

అతి తొందర్లోనే జిల్లా రాజకీయాల్లో కీలకమైన స్థానానికి ఎదిగిపోయాడు రుద్ర.

అతని సాత్వికమైన వేషధారణని, ముఖకవళికల్ని చూసినవాళ్ళు చేతులెత్తి మొక్కేవారు. అతని ముఖం ఒక మాస్క్‌లాగా అతని అంతరంగాన్ని ఎంతగా దాచిపెడుతోందా అని సుభద్ర ఎప్పుడూ ఆశ్చర్యపోతుంది.

అతని హయాంలో చాలా పథకాలకి ప్రారంభోత్సవాలు జరిగాయి. పోరంబోకు భూములు లేబరుకి ఇళ్ళ స్థలాలుగా పంచిపెట్టబడ్డాయి. మంచి నీటి కుళాయిలు వెలిసాయి. పల్లెపల్లెకీ సిమెంటు రోడ్లు వచ్చాయి.

వాటితో బాటు రుద్ర ఆస్తులూ పెరిగాయి. అమ్మిన ఆస్తులకి రెట్టింపు ఆస్తుల్ని కొన్నాడు. ప్రభుత్వం చేసే పనుల తాలూకు కాంట్రాక్టులన్నీ బినామీ పేర్లతో అతనివే.

ఉన్నట్టుండి ఓ రోజు పొలానికి వెళ్ళిన రుద్ర తండ్రిని ఎవరో చంపేసారు.

సుబ్బరాముడి అన్నదమ్ములే తన తండ్రిని చంపించారని రుద్రకి తెలిసింది. ఆ అన్నదమ్ముల్లో ఒకడిని రుద్ర మనుషులు చంపేసారు. హత్య చేసిన వ్యక్తి స్పాట్‌లో దొరికిపోవడం వల్ల విషయం బైటికి పొక్కిపోయింది.

పేపర్లు, టీవీలు దుమ్మెత్తిపోశాయి.

పనిలో పనిగా గోదావరి బేసిన్‌లో ఆయిల్ నిక్షేపాలు వెలువడినప్పుడూ, ఏలేరు స్కాంలోనూ, హైవే కాంట్రాక్టుల్లోనూ రుద్ర చాలా డబ్బు తినేసాడని, అతను చేయించిన పనుల్లో నాణ్యత లేదని, వేసిన మూడు నెలలకే రోడ్లు, కుళాయి పైపులు పాడైపోయాయని పత్రికలే ఏకేశాయి.

ఫలితంగా మూడోసారి ఎన్నికల్లో రుద్ర ఓడిపోయాడు. అయినా అతనేం నిరుత్సాహపడలేదు. "అయిదేళ్లు రెస్టు తీసుకుందాంరా. మధ్యలోనే ఎన్నికలొచ్చేస్తే మరీ మంచిది. ఈ విరామం తర్వాత గెలుపు మనదే" అనేవాడు తన మనుషుల్తో.

జనం నాడి తెల్సినవాడు రుద్ర. అందుకే ఖాళీ సమయాన్ని ఊరికే పోనివ్వలేదు. కోట్లు కోట్లు మింగేసిన వాళ్ళైనా కొన్ని పైసలు తమకోసం విదిలిస్తే ఆనందపడిపోయి తలలూగించే జనం ఉన్నన్నాళ్ళూ రాజకీయాలకేం ఢోకా లేదని రుద్రకి తెలుసు. అందుకే లేబరుకి రిక్షాలు కొనివ్వడం, వికలాంగులకి చక్రాల కుర్చీలు తెప్పించి ఇవ్వడం లాంటివి చేస్తూ జనంలో తన పేరు మరుగున పడిపోకుండా చూసుకుంటున్నాడు.

అటు అడవి నుంచి, ఇటు రాజకీయ ప్రత్యర్థుల నుంచి తన ప్రాణానికి హాని ఉందని రుద్రకి తెలుసు. అందుకే అతను బుల్లెట్ ప్రూఫ్ కోటు, కారు, పది మంది ప్రాణ రక్షకులు వెంటలేనిదే ఎక్కడికీ కదిలేవాడు కాదు.

ఒక రిక్షా ఆసామి పెళ్ళికి వెళ్ళి అక్షింతలు వేస్తున్న రుద్రని తలకి గురిపెట్టి దగ్గర నుంచి షూట్ చేసి పోలీసులకు లొంగిపోయాడొక కిరాయి వ్యక్తి.

విషయం ఫోన్లో తెలియగానే ఇంట్లో అందరూ గొల్లుమన్నారు. వెనక్కి తిరిగి బీరువాలోదేన్నో వెతుకుతున్న సుభద్రకి ఆ ఏడుపు వినగానే ఒళ్ళు ఝల్లుమంది. నిల్చున్నదల్లా కాళ్ళల్లో పటుత్వం తప్పినట్టై అక్కడున్న కుర్చీలో కూలబడింది.

పనిపిల్ల పార్వతి పరుగెత్తుకొచ్చి విషయం చెప్పినా ఆమెలో కదలిక రాలేదు.

తెలుసు. ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి కబురేదో వినాల్సి వస్తుందని తెలుసు. కాని, ఇంత తొందరగానని అనుకోలేదు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయాలు రక్తసిక్తమైపోయాయి. భారతదేశమూ అందుకు మినహాయింపు కాదని తెలుసు.

సుభద్రకెందుకో ఏడుపు రావడంలేదు-

రుద్ర మృతదేహాన్ని ఏకాయెకి ఇంటికి తీసుకొచ్చేరు. ఒకే ఒక్క బుల్లెట్ కణతలోంచి దూసుకెళ్ళి ప్రాణం తీయడం వల్ల శరీరం చెక్కుచెదరలేదు.

రుద్ర కళ్ళు తెరిచి ఉన్నాయి. ఆ కళ్ళల్లో చివరి క్షణంలో నిండిన ఆశ్చర్యం అలాగే ఉంది. పెదవులు బాధతో కాబోలు కొంకర్లు తిరిగాయి. చెవికి ముందు చెంపమీదున్న పెసరగింజంత పుట్టుమచ్చ పక్క నుంచి రక్తం ప్రవహించి మెడవంపులో గడ్డకట్టింది.

రాజధానిలోని అధిష్టానం నుంచి కబురందుకుని పోలీసులు, డాక్టర్లు ఇంటికొచ్చి పోస్టుమార్టం అయ్యిందని సర్టిఫై చేసారు. డూన్ స్కూల్ నుంచి పిల్లలు రావాల్సి ఉంది.

శవాన్ని అద్దాలపెట్టెలో భద్రపరిచారు. జనం తండోపతండాలుగా వచ్చి చూసి వెళ్తున్నారు.

రాత్రంతా జాగరణ.

తెల్లవారి పార్టీ ప్రముఖులంతా రాబోతున్నారని కబురొచ్చింది. ఎవరో సుభద్రని గదిలోకి తీసుకెళ్ళి గద్వాల్ జరీచీర కట్టేరు. మరీ రిచ్‌గా కన్పించకుండా నగలు ఉంచేవి ఉంచి, తీసేవి తీసేశారు. మళ్ళీ వచ్చి అదే కుర్చీలో అదే నిర్లిప్తతతో కూర్చున్న సుభద్రని చూసి చెవులు కొరుక్కున్నారు బంధువులంతా. "ఇదేం ఇడ్డూరం? ఇంత ఘోరం జరిగిపోతే దీనికి కళ్ళంట నీటి చుక్కలైనా వస్తున్నాయా" అంటూ. సుభద్ర తదేకంగా అద్దాలపెట్టెనే చూస్తోంది. అంత ఏకాగ్రతతో ఆమె దేన్ని చూస్తోందో చూసేవాళ్ళకి అర్థం కాక తికమక పడుతున్నారు. రాజకీయనాయకులంతా గుంపుగా ఒక్కసారే వచ్చారు. అందరూ పెద్దపెద్ద పూలమాలలు తెచ్చి అద్దాల పెట్టె మీద ఉంచి, సుభద్ర దగ్గరకి వచ్చి సాంత్వన వచనాలు చెప్పి వెళ్తున్నారు. సుభద్రకి ఇదంతా ఎన్నోసార్లు అనుభవించినట్టుంది.

ఇదే దృశ్యాన్ని తను ఎన్నోసార్లు టీవీలో చూసింది. రుద్రి, తను తప్ప మిగిలిన వాళ్ళంతా వాళ్లే. అవే చేతులు, అవే పూలమాలలు, అవే ఓదార్పు మాటలు.

సుభద్ర మనసులో ఎన్నెన్నో ప్రశ్నలు సుడులు తిరుగుతున్నాయి.

రుద్రి ఎందుకిలాంటి ప్రమాదభరితమైన జీవితాన్ని ఎంచుకున్నాడు? ఇదంతా అవసరమా?

డబ్బు కోసమా? - కావచ్చు. ధన సంపాదన ఒక వ్యసనం లాంటిది కదా! సేవా దృక్పథమా? - హు, రాజకీయాల్లోకి రాకుండా సేవ చెయ్యలేరా! పేరు కోసమా? - ఈ సూర్యుడు, చంద్రుడు, సముద్రాలు తప్ప శాశ్వతమైనవి ఏమున్నాయి? ఈ భూమి ఇలాంటి వాళ్ళెందర్నో చూసి ఉంటుంది. ఎవరైనా శాశ్వతంగా ఉండిపోయారా?

ఏమిటి, తననేదో వైరాగ్యం ఆవహిస్తున్నట్టుంది?

అతని ఆంతర్యం తెలిసీ తనకిలాంటి సందేహాలు రావడంలో ఔచిత్యం లేదు.

గుండెనెవరో గుప్పెట్లో పట్టి బంధించినట్టు ఉంది.

ఇంచుమించు ఇరవై ఏళ్ళు కలిసి కాపురం చేసిన వ్యక్తి మరణం తననెందుకు కదిలించడం లేదు? అతన్ని తను ప్రేమించలేదా? అతను తనని పట్టించుకోలేదని కోపమా? నిర్లిప్తతా? ఏది... ఏమిటిది సాయంత్రానికి పిల్లలు వచ్చేరు. వాళ్ళు 'నాన్న', అనకుండా 'అమ్మా' అంటూ ఏడుస్తూ పరుగున వచ్చి సుభద్రని చుట్టుకున్నారు. అప్పుడు పగిలింది దుఃఖభాండం -

సుభద్ర కన్నీటి సంద్రమై ఘొల్లుమంది.

పిల్లల్తో బాటు లేచి అద్దాల పెట్టెమీద వాలిపోయింది. రుద్ర చేతుల్ని, పాదాల్ని, బుగ్గల్ని నిమరాలన్పిస్తోంది.

అది వీలు కాదు. బుద్బుదప్రాయమైన దేహం ఇప్పుడిక తాకశక్యం కానిది.

మనోజ, కిరణ్ ఎప్పట్నుంచి ఏడుస్తున్నారో, వచ్చే సరికి వాళ్ళ కళ్ళు వాచిపోయి ఉన్నాయి. ఇక ఓపిక లేనట్టు తల్లివొడిలో వాలిపోయారు.

పిల్లలు రావడం, తండ్రి దేహాన్ని ఆఖరి చూపులు చూడడం అయ్యింది. కాబట్టి అప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేసి ఉండడం వలన తరువాతి కార్యక్రమం ప్రారంభమైంది.

ముక్కుపచ్చలారని కిరణ్ తండ్రికి తలకొరివి పెట్టేడు. ఆశేషజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా రుద్ర దేహానికి దహన కార్యక్రమం జరిగింది.

అందరూ వెళ్ళిపోయేక చీకట్లో ఒంటరిగా వచ్చేడొక పెద్దాయన. ప్రఖ్యాత కవి. ఒకప్పుడు ఉద్యమంలో అజ్ఞాతంగా అడవుల్లో గడిపినవాడు. అతన్ని అందరూ కవి తాతయ్య అంటారు. వస్తూనే కిరణ్‌ని కౌగిలించుకుని భోరుమని ఏడ్చేడు. ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఓదార్చేడు. అప్పటికప్పుడు రుద్రపైన ఓ కవిత ఆశువుగా చెప్పేడు.

మనోజ తల నిమిరేడు. సుభద్రని సానుభూతిగా పలకరించేడు.

"ఇంతటి ఫాలోయింగ్ ఒక్క రాజకీయ నాయకులకి తప్ప మరెవరికైనా ఉందా?"

"కొందరు సినిమా హీరోలకుంది. నేరం చేసినా జైలుకెళ్ళకుండా తప్పించుకునే నైపుణ్యం కూడా వీళ్ళిద్దరికే ఉంది".

"పైగా జనం జేజేలు..." అంటూ చెవులు కొరుక్కున్నారు పత్రికల వాళ్ళు.

❋ ❋ ❋

పదో రోజు దశదినకర్మ జరుగుతోంది. కాలంతో బాటు సహజంగానే బంధువుల్లో దుఃఖాతిశయం తగ్గింది.

ఆ రోజక్కడ మరణించిన వ్యక్తికి చేస్తున్న కర్మకాండలా లేదు. కలవారింట్లో వైభవంగా జరుగుతున్న పెళ్ళిలా ఉంది. తాటాకు పందిళ్ళు, పందిళ్ళకు కట్టిన పూలమాలల తోరణాలు, ఇల్లంతా కొత్తగా రంగులు వేసి అలంకరించేరు.

రాష్ట్రం మొత్తం నుంచి పార్టీకి చెందిన జనం తరలివచ్చేరు. కార్యక్రమాలన్నీ సుభద్ర అన్నగారి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. వెండి చెంబులోని నీళ్ళల్లో తమలపాకు వేసి దానిపైన కిరణ్ అరచెయ్యి బోర్లించి గోత్రసమేతంగా తాత ముత్తాతల పేర్లన్నీ పలికిస్తున్నాడు పంతులుగారు. బియ్యం పిండి, ముడి నువ్వులు కలిపిచేసిన పెద్ద పెద్ద ముద్దల్ని అరటాకుల్లో పెట్టించి ఏడు తరాలకి పిండప్రదానం చేయించి నీళ్ళొదిలించేడు. సాంబ్రాణి, గుగ్గిలం ధూపం ఇల్లంతా వ్యాపించింది. బైట పందిట్లో వెలిగించిన అగరువత్తుల మంచి గంధం పరిమళం పూల తోరణాల సుగంధంతో కలిసి ఊరంతా అలుముకుంది.

కిరణ్ ఎర్రబడ్డ కళ్ళతో ఓ పక్క పంతులుగారు చెప్పేది చేస్తూనే పదేపదే తండ్రి ఫోటో వైపు చూస్తున్నాడు. ఎర్రగులాబి పూలమాలలోంచి రుద్ర మొహం నవ్వుతూ కన్పిస్తోంది.

వచ్చిన వాళ్ళంతా భోజనాలు చేసి వెళ్ళవలసిందిగా పదేపదే మైకుల్లో విజ్ఞప్తి విన్పిస్తోంది.

వెనక పెరట్లో వంటలు జరుగుతున్నాయి.

ఉదయాన్నే వందకుపైగా మేకపోతుల తలలు తెగాయి. లెక్కలేనన్ని కోళ్ళు కోయబడ్డాయి. జిల్లాకే ప్రసిద్ధి చెందిన బుడమేటి బొచ్చు చేప ముక్కలు ఫ్రై చెయ్యబడ్డాయి. వందల గుడ్లు పులుసులో తేలుతున్నాయి.

గారెలు, బూరెలు, బొబ్బట్లు వేడివేడిగా తయారవుతున్నాయి. పెద్ద పెద్ద గుండిగల్లో మాంసం ఉడుకుతోంది. ఆ కూరల మసాలా వాసన వచ్చిన వాళ్ల నోళ్లల్లో నీళ్ళూరిస్తోంది.

పూజ జరుగుతున్న హాల్లో గోడకి చేరబడి కూర్చుంది సుభద్ర. తల్లి ఒళ్ళో తల పెట్టుకుని చేరబడిన మనోజ డ్రైగా చూస్తోంది. సుభద్రకి ఆ జనాన్ని చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది.

పూజ ముగియబోతుండగా ఒక్కసారిగా జనంలో కలకలం రేగింది.

పార్టీ అధిష్టానవర్గంతో బాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, వాళ్ళ మందీ మార్బలం అంతా కార్లలో దిగేరు.

నేరుగా పూజ దగ్గరకొచ్చి విషాదవదనాల్తో రుద్ర ఫోటోకి పూల మాలలు వేసి నమస్కరించేరు. వాళ్ళ కోసమే వడ్డనలు ప్రారంభించకుండా ఆపు చెయ్యబడ్డాయని తెలిసి చకచకా అటు నడిచేరు.

భోజనాలు అయ్యాక అధిష్ఠానంలో నలుగురు తప్ప అందరూ వెళ్ళిపోయేరు. ఆ నలుగురూ మేడ మీద గదుల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

పూజ ముగియగానే సుభద్ర లేచి పొద్దుట్నుంచి ఉపవాసం ఉన్న కిరణ్‌కి కాస్త పెరుగన్నం తినిపించింది.

సాయంకాలం నాలుగైనా వంటలు, భోజనాలు కొనసాగుతూనే ఉన్నాయి.

కుటుంబ సభ్యులందరితో కలిసి సుభద్ర కాస్త ఎంగిలిపడి నడుం వాల్చేసరికి వాళ్ళు పిలుస్తున్నారంటూ సుభద్ర అన్నగారు వచ్చేడు. ఎప్పుడూ రుద్ర వెంట ఎక్కడికీ వెళ్ళి ఉండలేదు సుభద్ర.

అతను అధికారంలో ఉన్నా, లేకున్నా చెయ్యాలనుకున్న కార్యక్రమాలన్నీ జనాన్ని వెంటబెట్టుకునే చేసాడు. ఎవర్నీ ఎప్పుడూ ఇంటికి పిలిచింది లేదు. పార్టీ వాళ్ళొచ్చినప్పుడు వాళ్ళకి విందు భోజనాలు టౌన్లోనే ఏర్పాటు చేసి అక్కణ్ణుంచే పంపించేసేవాడు.

రుద్ర రాజకీయాల్లోకొచ్చాక మరీ ఘోషా పాటించవలసొచ్చింది సుభద్రకి. కేవలం బంధువులని తప్ప ఇతరుల ముఖాలు చూసే అవకాశం కూడా కలగలేదిన్నాళ్ళూ. ఇప్పుడు ఒక్కసారిగా వాళ్లతో మాట్లాడాలంటే ఏమిటోగా ఉంది. చుట్టాల్లో ఓ పెద్దావిడ లేచొచ్చి సుభద్రకి కొంగు భుజాలమీంచి నిండుగా కప్పింది.

సగం మెట్లమీద ఆగిపోయి వెనక్కి తిరుగుతూ "అన్నయ్యా! మీరు మాట్లాడి పంపించెయ్యండి. నాకెవరితోనూ మాట్లాడాలని లేదు" అంది సుభద్ర.

"అయ్యో అమ్మడూ!" అంటూ అడ్డు నిలబడ్డాడాయన. "వాళ్ళు అంత దూరం నుంచి వచ్చినప్పుడు మన మర్యాద మనం పాటించాలా వద్దా?" అన్నాడు.

ఒక్క నిముషం అన్నగారి కళ్ళల్లో దేన్నో వెతుకుతూ చూసింది. చివరికి ఒక నిట్టూర్పు విడిచి అతని వెంట నడిచింది.

సుభద్ర గదిలోకి అడుగుపెట్టగానే అందరూ సానుభూతిగా చూస్తూ "నమస్కారం" అన్నారు.

సుభద్ర అందరికీ నమస్కరించి తలదించుకుని నేలను చూస్తూ కూర్చుంది. సుభద్ర గుండెల్లో అగ్ని పర్వతం బద్దలవుతున్నట్టుంది.

"రుద్ర ఇలా మరణించడం చాలా బాధగా ఉందమ్మా" అన్నాడొకాయన నిశ్శబ్దాన్ని ఛేదించి సంభాషణ ప్రారంభిస్తూ.

సుభద్ర తల పైకెత్తి చూసింది.

అక్కడున్న నలుగుర్నీ తను టీవీ వార్తల్లో చాలా సార్లు చూసింది. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు "ఎక్కడ వాళ్ళని డామినేట్ చేస్తామోనని సొంత పార్టీ వాళ్ళే వెన్నుపోటు పొడిచేరు" అని రుద్ర అనడం వింది. పైకి ఇలా మాట్లాడుతున్నా, వీళ్ళ అంతర్యాల్లో ఏముందో తెలీదు అనుకుంది.

పార్టీ నాయకుడు గొంతు సవరించుకుని "సుభద్రగారూ, మీకు మన పార్టీ పోర్టు ఫోలియో ఇవ్వాలనుకుంటున్నాం. ఈ రోజు నుంచీ మీరు మన పార్టీలో మెంబరు" అన్నాడు.

"అయ్యయ్యో" అంది సుభద్ర అనాలోచితంగా, ఆమె గొంతులో ఖంగారు, భయం ధ్వనించాయి.

"అలాక్కాదా, సరే, ఇప్పుడే ఎక్కడో ఓ చోట బై ఎలక్షను పెట్టి మిమ్మల్నీ గెలిపిస్తాం. మినిస్టర్నీ చేస్తాం" అన్నాడాయన.

ప్రజల తీర్పు ఎంత చులకనైపోయింది! అనుకుంది సుభద్ర. రాజకీయాల గురించి ఓనమాలైనా తెలీని తనను ఎందుకు నిలబెడతామంటున్నారో అర్థం చేసుకోలేదా తను?

జరిగిన సంఘటన తాలూకు సానుభూతిని పార్టీకి ఉపయోగించుకోడానికేగా! తల్చుకున్నప్పుడల్లా ప్రభుత్వాల్ని రద్దు చెయ్యడం, తిరిగి ఎలక్షన్స్ పెట్టడం - నిర్ణయాలన్నీ వీళ్ళ చేతుల్లోకి తీసుకుంటూ దానికి ప్రజాభిప్రాయం అని పేరుపెట్టడం ఎంత హాస్యాస్పదం!

జనమంతా ఇష్టపూర్వకంగానే ఎన్నికల్లో ఓటు వేస్తున్నారా? ఆలోచిస్తోంది సుభద్ర.

సుభద్ర అంతగా ఆలోచిస్తూండడం చూసి ఎక్కడకాదంటుందో అని ఆమె అన్నయ్య కంగారు పడ్డాడు. "అలాగే, మీరెలాగంటే అలాగే కానివ్వండి. అమ్మాయి మంచిని కోరే కదా మీరూ చెప్తున్నారు. తప్పకుండా అలాగే కానిద్దాం" అన్నాడు.

తనకి ఆలోచించుకునే అవకాశం ఇవ్వకుండా అన్నగారు అలా సమాధానం చెప్పడం సుభద్రకి చికాకన్పించింది. ప్రస్తుత రాజకీయాల మీద ఆమెకి సదభిప్రాయం లేదు. జాతీయ పార్టీలో ఉంటే కేంద్రం కనుసన్నల్లోను, ప్రాంతీయ పార్టీలో ఉంటే అధినాయకుడి అడుగుజాడల్లోను ఉంటూ స్వయం నిర్ణయాధికారంలేని డమ్మీ పదవులు వీళ్ళవని నాకు తెలీదా అనుకుంది. శంకుస్థాపనలకీ, ప్రారంభోత్సవాలకీ జరీచీరలు కట్టుకుని, ముఖం నిండా నవ్వు నింపుకొని ఫోటోలకి ఫోజులివ్వడమేగా చెయ్యాల్సింది! ఎవరైనా సొంత నిర్ణయాన్ని అమలు పరిస్తే వాళ్ళని గద్దెదించేవరకూ నిద్రపోరు వీళ్ళు. ఇక ప్రభుత్వోద్యోగుల్తోనూ, ఇతరుల్తోనూ వ్యవహారం కరవమంటే కప్పకి కోపం విడవమంటే పాముకి కోపం.

"భయమేం లేదమ్మా, మీ వెంట మేమంతా ఉంటాం. అన్నయ్యగారున్నారు" అన్నారు వాళ్ళు వెళ్ళేముందు.

"ఒద్దొద్దు మాకీ సంకెళ్ళొద్దు. ఈ ప్రాణ భయాలొద్దు. ఈ కంచెను పగలగొట్టండి. మమ్మల్ని స్వేచ్ఛగా నలుగురితో కలిసి బతకనివ్వండి" అని అరవాలన్పించింది సుభద్రకి.

సంధ్యవాలకముందే సుభద్రని, పిల్లల్ని వదిలేసి అందరూ వెళ్ళి పోయేరు. ఆ రోజు బైటివాళ్ళు ఆ ఇంట నిద్రచేస్తే అరిష్టం అని నమ్ముతారు.

అతనిక లేడు అని అనుకుంటేతప్ప రుద్ర ఎప్పట్లాగే ఎక్కడికో వెళ్ళినట్టే ఉంది సుభద్రకి.

మర్నాడే పిల్లల ప్రయాణం.

వాళ్ళ కోసం బేగ్స్ సర్దుతోంది సుభద్ర.

చీకటి పడేవేళ హఠాత్తుగా మొదలైన వర్షం ఇంకా కురుస్తూనే ఉంది.

ఉన్నట్టుండి వెనకనుంచి వచ్చి తల్లి వీపును హత్తుకుంది మనోజ.

"అమ్మా! మరేం...'

"ఏంటమ్మా మనో... చెప్పు"

"నువ్వు మినిస్టరైతే చాలా బావుంటుంది"

నిర్ఘాంతపోయింది సుభద్ర. తేరుకుని అడిగింది "ఎవరికి బావుంటుంది?".

"మాకే, తమ్ముడికీ నాకూ, స్కూల్లో మా అమ్మ మినిస్టర్ అని చెప్పడం ఎంత గొప్పగా ఉంటుందో తెల్సా! నాన్నగారు మినిస్టర్‌గా ఉన్నప్పుడు మమ్మల్ని అందరూ ఎంతో స్పెషల్‌గా చూసేవాళ్ళు. అందుకే నేను కూడా పెద్దయ్యాక మినిస్టరవుతా".

పక్కనే కూర్చుని సాక్స్ మడతలు పెట్టుకుంటున్న కిరణ్ వెంటనే "అమ్మా, నేను మాత్రం పెద్దయ్యాక మన రంగంపెట్టెలో ఉన్న గన్ తీసుకుని కవి తాతయ్య వెంట అడవిలోకెళ్ళిపోతాను" అన్నాడు.

సుభద్ర నిలబడడానికి ఆసరా దొరకనట్టె పక్కనే ఉన్న రంగం పెట్టెమీదికి ఒరిగి, దాన్ని గట్టిగా పట్టుకుంది.

*మనభూమి, జనవరి, 2006*